క్షయవ్యాధి నిర్మూలన మనందరి బాధ్యత : ఐటిడిఏ పిఓ సూరజ్ గనోరే

విశాలాంధ్ర-రంపచోడవరం : క్షయ వ్యాధి పూర్తిస్థాయిలో నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పురస్కరించుకొని శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం నుండి క్షయ వ్యాధి నిర్మూలనకు సంబంధించిన ర్యాలీని ప్రాజెక్ట్ అధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోర్ మాట్లాడుతూ ఏజెన్సీలోని క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన లేక చాలామంది ఇబ్బందులు పడుతున్నారని అదేవిధంగా ఏజెన్సీలోని ఎవరికైనా క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారు వెంటనే ఆసుపత్రులకు వచ్చి టెస్టులు చేయించుకుని మందులు వాడిన యెడల క్షయ వ్యాధి నుండి రక్షణ పొందవచ్చని ఆయన తెలిపారు. 2025వ సంవత్సరానికి ప్రపంచంలోనే క్షయవ్యాధి పూర్తిస్థాయిలో నిర్మూలించే విధంగా అందరం కలిసి ముందుకు సాగాలని ఆయన అన్నారు భారతదేశపు ఆరోగ్య సంస్థల నివేదికల ప్రకారం 2.6 లక్షల మంది క్షయవ్యాధితో బాధపడుతున్నారని అదేవిధంగా సుమారు 4వేల మంది ప్రతి సంవత్సరం ఈ వ్యాధితో చనిపోవుతున్నారని ఆయన తెలిపారు. ఎవరైనా క్షయ వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి ఆసుపత్రికి వెళ్లి క్షయవ్యాధి టెస్టులు చేయించుకోమని అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు అదేవిధంగా ప్రతి గ్రామంలో ఆశ వర్కర్లు ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలపై తెలుసుకుంటున్నారని ఆయన తెలిపారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు క్షయ వ్యాధి నిర్మూలన నినాదాలతో వెళ్లి అంబేద్కర్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి చేయవ్యాధి నిర్మూలలపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది ఈకార్యక్రమంలో డియం&హెచ్ఓ డాక్టర్ జి.ప్రకాశం, ఏరియా ఆసుపత్రి సూపర్ ఇండెంట్ డాక్టర్ లక్ష్మి డాక్టర్ వెంకట ఇందిరా వైద్యాధికారులు రాధిక అపూర్వ వినోద్ సుజిత సాహిన్ యన్‌యంలు ఆశ వర్కర్లు డిగ్రీ కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి మృతితో తల్లడిల్లిన కుమార్తె యమున

పుట్టెడు దుఃఖంలో పదవ తరగతి పరీక్ష రాసిన విద్యార్థిని

విశాలాంధ్ర-చింతపల్లి : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థిని శేషగిరి యమునకు తల్లి మరణం తీరని దుఃఖాన్ని కలిగించింది. తన మాతృమూర్తి దేశగిరి సరస్వతి రక్తపోటు అధికం కావడంతో కుటుంబ సభ్యులు హుటహుటీన చింతపల్లి ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. శనివారం తన స్వగ్రామమైన దేవరాపల్లిలో అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో గూడెం కొత్త వీధి గ్రామంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న ఆమె కుమార్తెకు విషయం తెలియపరచడంతో తల్లడిల్లింది. తప్పని పరిస్థితులలో పుట్టెడు దుఃఖంలో పదవ తరగతి పరీక్ష పూర్తిచేసుకుని గ్రామానికి చేరుకున్న ఆ యువతి తల్లి మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమైంది.

నవ్వుతూ ఉరికంబాన్ని ముద్దాడిన భగత్‌సింగ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

అల్లూరి జిల్లా అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కన్వీనర్ రాజశేఖర్.

విశాలాంధ్ర-చింతపల్లి : నవ్వుతూ ఉరి కంబాన్ని ముద్దాడిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లను యువత ఆదర్శంగా తీసుకోవాలని అల్లూరి జిల్లా అఖిలభారత విద్యార్థి సంఘం (ఏఐఎస్ఎఫ్) జిల్లా కన్వీనర్ కే.రాజశేఖర్ అన్నారు. భగత్ సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి క్రిష్ణతో కలసి ఆయన మాట్లాడుతూ పంజాబ్‌లోని లియార్ పూర్ జిల్లాలోని బంగా అనే గ్రామంలో 1907 సెప్టెంబర్ 27న విద్యావతి, కిషన్ సింగ్‌లకు రెండవ సంతానంగా జన్మించిన షహీద్ భగత్ సింగ్ పిన్న వయసులోనే స్వాతంత్ర ఉద్యమ పట్ల ప్రేమ, శ్వేత జాతి పాలన పట్ల విముఖత పెంచు కొన్నాడన్నారు.

భగత్ సింగ్ 1919 ఏప్రిల్ 13 న జలియన్ వాలా బాగ్ మారణ హోమం గురించి విని చలించిపోయిన ఆయన బ్రిటీష్ వారిని తరిమి కొట్టడమే తన జీవితలక్ష్యం అంటూ శపథం చేశారన్నారు. నవ జవాన్ అనేసంస్తను సుఖ దేవ్, భగవతీ చరణ్, యశ్ పాల్ తదితరులతో 1928 లో స్థాపించాడన్నారు. పారిశ్రామిక వివాదాల అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో నాటి పార్లమెంట్ పై బాంబులు విసిరి, ఎర్ర కరపత్రాలను వెదజల్లి బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేసిన ధీరుడు భగత్ సింగ్ అన్నారు. బ్రిటిష్ వారి గుండెల్లో గునపంగా మారిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లను బ్రిటీష్ ప్రభుత్వం 1931 మార్చి 23న భగత్‌సింగ్‌ను ఉరితీసి, ఓవిప్లవ సూరీడు అస్తమించ దానికి కారకులయ్యారన్నారు.. ఆయన మరణించినా, ఆయన ఆశయాలు సజీవంగా వున్నాయన్నారు. ప్రతి యువకుడు భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని దేశ పురోభివృద్ధికి పాటు పడాలని ఈసందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పి.మత్స్యరాజు, జి.రమేష్, పి.రాజు బాబు, నాయుడు, జి.అనిల్, కె. దేవదాసు, కె.మల్లేష్, ఎమ్. ఈశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గడ్‌లో ఎన్‌కౌంటర్.... ఇద్దరు మావోయిస్టులు మృతి?

ఇద్దరు జవాన్లకు గాయాలు... రాయపూర్‌కు తరలింపు

విశాలాంధ్ర-చింతూరు : ఛత్తీస్గడ్ రాష్ట్రంలోని దంతివాడ బీజాపూర్ సరిహద్దుల్లో గల పిడియా అడవుల్లో శనివారం మావోయిస్టులకు, పోలీస్‌లకు ఎదురు కాల్పులు జరిగినట్లు సమాచారం. ఈ కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందినట్లు తెలిసింది (మృతదేహాలు లభ్యం కాలేదు). బీజాపూర్, దంతివాడ, సుఖమాలోని కోబ్రాదళాలు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించాయి. పిడియా ప్రాంతాల్లోనే ఐఇడి మందు పాత్రను మావోయిస్టులు పేల్చారు. ఈ సంఘటనలో ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. వీరిని హెలికాప్టర్లో రాయపూర్ తరలించారు. ఆపరేషన్‌లో బీజాపూర్ ఎస్పి జీతేంద్రకుమార్, దంతివాడ ఎస్పి గౌరవ్ రాయి, సుకుమా ఎస్పి కిరణ్ చౌహాన్ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

పెన్ పవర్ పాత్రికేయుడు చంటిబాబుకు మాతృవియోగం

విశాలాంధ్ర-జీకే వీధి : జీకే వీధి పెన్ పవర్ పాత్రికేయుడు మాదిరి చంటిబాబుకు మాతృవియోగం కలిగింది. ఉదయాన్నే దైనందిన కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఆమె గుండె నొప్పితో ఒక్కసారిగా కుప్పకూలడంతో కుటుంబ సభ్యులు108 అంబులెన్స్ కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది హుటాహుటిన చంటిబాబు స్వగ్రామమైన దామనాపల్లి పంచాయతీ దొడ్డికొండ చేరుకుని చంటిబాబు తల్లి ఆరోగ్య పరిస్థితిని పరీక్షించారు. అప్పటికే ఆమె తుదిశ్వాస విడిచినట్లు వైద్య సిబ్బంది ధ్రువీకరించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. గుండె నొప్పితో ప్రాణాలు కోల్పోయిన చంటిబాబు మాతృమూర్తి పార్థివ దేహానికి వైకాపా పాడేరు నియోజకవర్గం అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వర రాజు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'కేర్ టేకర్స్'కి దరఖాస్తు ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ మరియు నివాస్ హెచ్ఆర్ సంయుక్త ఆధ్వర్యంలో జపాన్‌లో హాస్పిటల్ యందు కేర్ టేకర్స్ గా వర్క్ చేయడానికి అర్హులైన ఏఎన్ఎం,జి ఎన్ ఎమ్ మరియు బిఎస్సి నర్సింగ్ చదివిన యువతీ యువకులకు జపనీస్ భాష నేర్పించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు బెంగళూరు నవిస్ హెచ్అర్ సెంటర్ యందు భోజన వసతితో ఆరు నెలలు పాటు వుంటుందని ఈ కోర్సు ఫీజు రూ.3,50,000/- ఉంటుంది అని దీనిలో రూ.25000/- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ బరిస్తుందని, మిగిలిన రూ.3,25,000/- అభ్యర్థి మూడు దశలలో కట్టవలిసి వుంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం జపాన్ లో హాస్పిటల్స్ లో పని చేయవలిసి వుంటుందని రూ.1,10,000/- నుండి రూ.1,40,000/- జీతం ఉంటుందని ఆసక్తి గల 32 వయస్సు గల యువతి యువకులు apssdc.skilluniverse.in వెబ్ సైట్ నందు నమోదు చేసుకోవాలని సూచించింది లేదా 9949927899 నెంబర్ ని సంప్రదించవచ్చని తెలిపారు.

పాడేరు అసెంబ్లీ టికెట్ టిడిపికి దక్కేనా...? బీజేపీకి చిక్కేనా..?

విశాలాంధ్ర-చింతపల్లి : టిడిపి, జనసేన, బిజెపి పార్టీల కూటమిలో భాగంగా పాడేరు అసెంబ్లీ టికెట్ తెలుగుదేశం పార్టీకి దక్కేనా...? బిజెపికి చిక్కేనా అనే ఊహాగానాలు నియోజకవర్గ ప్రజల్లో ఊపందుకున్నాయి. తెదేపా ఒకటి, రెండు జాబితాలలో పాడేరు అసెంబ్లీ టికెట్టు ఖరారు కాకపోవడంతో పార్టీ కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. బిజెపికి టికెట్ ఖరారు అవుతుందనే ఊహగానాల్లో టిడిపి శ్రేణులు నిరాశతో ఉన్నారు. పార్టీ అధిష్టానం పునరాలోచించుకొని పాడేరు అసెంబ్లీ టికెట్ తెదేపాకు కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించి అధినేతకు బహుమతిగా ఇచ్చేందుకు నాయకులు, కార్యకర్తలతో పాటు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. మిత్ర ధర్మాన్ని పాటించి బిజెపికి సీటు కేటాయిస్తే వైకాపా విజయం నల్లేరు మీద నడక అవుతుందని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా కూటమి అధినాయకులు పునరాలోచన చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

టీబీ అవగాహన దినోత్సవం

విశాలాంధ్ర-హుక్కుంపేట : అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హుకుంపేట మండలంలో ప్రపంచ క్షయవాది దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండలంలో జరిగిన కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు పాల్గొని వ్యాధి పట్ల ప్రజల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అక్కడ రోగులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది ఆశా కార్యకర్తలు నర్సులు పాల్గొన్నారు.

బాలబడి నిర్వహణకు దాతలు ముందుకు రావాలి

రూరల్ డెవలప్మెంట్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి గాడి శ్రీను

విశాలాంధ్ర-జి.మాడుగుల: అల్లూరి సీతారామరాజు జిల్లా, జి.మాడుగుల చింతపల్లి మండలాల పరిధిలో లోతట్టు మారుమూల ఆదిమతెగ ఆదివాసీ (పివిటిజి) గ్రామాల్లో గత కొన్నేళ్లుగా రూరల్ డెవలప్మెంట్ సర్వీస్ సొసైటీ తరపున బాలబడి నిర్వహిస్తున్నామని వీటిని మరింతగా విస్తృతం చేసేందుకు దాతలు ముందుకు రావాలని ఆ సొసైటీ కార్యదర్శి గాడి శ్రీను కోరారు. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటన ద్వారా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పెద్దపొర్లు, మూగమర్రి, బంగారుబుడ్డి, కొత్తపెదబయలు, చింతలూరు, భీమునిపనుకు, బర్సింగిమెట్ట, తోకరాయి, పూతికమెట్ట గ్రామాల్లో 242 మంది బాలబాలికలతో 9 గ్రామాల్లో ఈ బడులు నిర్వహణ జరుగుతుందన్నారు. ఏడాదికి 60 నుండి 70మంది ఈ బాలబడి పిల్లలను దగ్గర్లో ఉన్న గురుకులాల్లో నమోదు చేయడంతోపాటు వారు మిగతా పిల్లలతో కలిసి వుండే విధంగా ఎప్పటికప్పుడు పిల్లలను పరిశీలిస్తూ వస్తున్నామన్నారు. ప్రస్తుతానికి వున్న

రిసోర్స్ మేరకు తొమ్మిది గ్రామాల్లో ఈ బడులను నిర్వహిస్తున్నామని, నిజానికి ఇలాంటి బడులు అవసరమైతే చాలానే ఉందన్నారు. తాము పిల్లలకు ఆటపాటల ద్వారా చక్కనైన వాతావరణం మధ్య అదే గ్రామానికి చెందిన చదువుకున్న వ్యక్తిని ఎంపిక చేసి వారికి శిక్షణను ఇచ్చి, లోకల్ కువి భాష నుండి తెలుగు బాషకు తర్జుమా చేసుకుని ప్రత్యేకమైన సిలబస్‌ను తయారుచేసుకుని పిల్లలకు తెలుగు, ఆంగ్ల పదాలు నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ బడులు నిర్వహణకు ఎన్టీపీసీ, శ్రీనివాస్ ఫార్మ్స్, శారద మెటల్స్, శ్రవణ్ షిప్పింగ్, ఆర్ హెచ్ ఐ మాగ్నేసిట, మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి వారి సహాయం సి.ఐ.ఐ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. వీళ్ళే కాకుండా కొంతమంది వ్యక్తులు వీటిని సందర్శించి వాళ్లకు తోచిన మేరకు వివిధ రూపాల్లో ఎప్పటికప్పుడు సహకారం అందిస్తూనే వస్తున్నారన్నారు. అలా అందించిన సహకారంతో పిల్లలకు నిన్న యునిఫామ్స్, చెప్పులు, స్కూల్ బ్యాగ్స్, టోపీలు, వులెన్ పొంచాస్, స్టడీ మెటీరియల్స్, చాక్లెట్స్, మిఠాయిలు, బొమ్మలు పంపిణీ చేశాంమని, నిజానికి ఇలాంటి బడులు అవసరం అవశ్యకత చాలా గ్రామాలకు ఉందన్నారు. ప్రభుత్వం ఇలాంటి మారుమూల గ్రామాలను దృష్టిలో పెట్టుకొని ప్రతీ లోతట్టు గ్రామానికి ఏక ఉపాధ్యాయ ప్రిప్రైమరీ బడులను నిర్వహించాలని పలుమార్లు విన్నవించినప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదన్నారు. కనీసం ప్రభుత్వాలు స్పందించేంత వరకు దాతలు ముందుకొస్తే మరిన్ని గ్రామాలకు తమ బాలబడులను విస్తరించి కొంతమందికైనా చదువుని అందుబాటులోకి తేవచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉమ్మడి అభ్యర్థి ముమ్మర ప్రచార జోరు... వీడని ఆశావహుల వర్గపోరు

- నియోజకవర్గంలో మొదలైన ఆపరేషన్ ఆకర్ష...
- రెడ్ కార్పెట్‌తో సిద్ధం అంటున్నా వైకాపా
- తలోదారిలో తెదేపా వర్గాలు... అధిష్టానం ఆదేశించిన వీడని పంతాలు
- వర్గం రాజకీయాలు దేనికి సంకేతం

విశాలాంధ్ర-కురుపాం : నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి ఇంటింటి ప్రచారం ఓవైపు ముమ్మరం చేస్తుంటే అదే సమయంలో తెలుగుదేశం పార్టీ టికెట్ ఆశావహులతో మాజీ గ్రంథాలయం చైర్మన్ దత్తి లక్ష్మణరావు జియ్యమ్మ వలస మండలంలోని వెంకటాపురంలో తన నివాసంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా భవిష్యత్తు కార్యాచరణ ఏమిటి, ఏ నిర్ణయం తీసుకున్నా అంతా ఒకే గొడుగు కింద పని చేసేలా సమాలోచనలు జరిపారు.ఈసమావేశంలో తెలుగు దేశం పార్టీ టికెట్ ఆశావహులు, వృత్తి మద్దతుదారులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ జడ్పీటీసీలు రెండో వర్గం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ తరహా వర్గం రాజకీయాలు దేనికి సంకేతం అంటూ పలువురు బహిరంగ విమర్శలు చేస్తుంటే మరికొందరు పార్టీ కోసం కష్టపడిన వారు డిమాండ్లను పరిష్కరించాలని కోరటం తప్పేముందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఉన్నందున ఇలా వర్గాలుగా వీడి పనిచేయటం ప్రత్యర్థికి అవకాశాలు నేరుగా కల్పించడమే అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికైన ఇరువురు మధ్యం సయోధ్య అతి త్వరలో చేయకుంటే నిర్లక్ష్యంనకు భారీ మూల్యం తప్పనిసరి అని తెలుగుదేశం పార్టీ నాయకుల బహిరంగా గుసగుసలు వినిపిస్తున్నాయి.

నియోజకవర్గంలో మొదలైన ఆపరేషన్ ఆకర్ష : అత్యంత ప్రతిష్టాత్మకంగా ఉన్న 2024ఎన్నికల్లో ప్రతీ ఒక్కరికీ విలువైన ఎన్నికలు అయినందున అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది.అందుకోసం తెలుగు దేశం పార్టీలో అసమ్మతి నిగంపగుత్తగా ఆపరేషన్ ఆకర్ష ద్వారా కైవసం చేసుకునేందుకు అవసరమైన కార్యాచరణ అత్యంత రహస్యంగా అమలు చేస్తోంది. ఇప్పటికే జిల్లా పెద్ద తలకాయ అన్ని చూసుకుంటాననీ గత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సమయం లో ఉన్న స్నేహంతో ఆహ్వానం పలుకుతూ సందేశం ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. మూడు రోజుల్లో అంగీకారాన్ని తెలుపుతామని సమయం అడిగినట్లు తెలిసింది.అలాగే భవిష్యత్తు కార్యాచరణ మూడు రోజుల్లో ప్రకటిస్తాం అని దత్తి లక్ష్మణరావు సమావేశం లో బహిరంగ ప్రకటన చేశారు. తెలుగు దేశం పార్టీ నియోజకవర్గంలో మంచి కేడర్ తో ఉన్నప్పటికీ కేవలం ఒక సారి మాత్రమే ఎమ్మెల్యే పదవి చేజిక్కించుకున్న పరిస్థితి.కర్ణుడు చావుకు వంద కారణాలన్నట్లు ప్రతీసారీ కారణాల అన్వేషించి సరిచేయకుండా వదిలి వేయటం ప్రధాన కారణం అని చెప్పక తప్పదు.

భగత్ సింగ్ ఆశయాలు కొనసాగిద్దాం

సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు

విశాలాంధ్ర-సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నియోజకవర్గం సీతంపేట మండలంలో గల గాడిదపాయ గ్రామంలో మన్యం జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, శుక్దేవ్‌ల 93వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. ఇందులో భాగంగావారి ఆశయాలను అనునిత్యం కొనసాగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కూరంగి గోపి నాయుడు, సిపిఐ మండల కార్యదర్శి కూరంగి జగదీష్, కూరంగి అజయ్, కూరంగి నవరాజు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రూట్ మ్యాప్ తయారు చేసుకోవాలి

రిటర్నింగ్ అధికారి కల్పనకుమారి

విశాలాంధ్ర-సీతంపేట : నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్లకు సంబంధించి రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలని పాలకొండ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కల్పనకుమారి అన్నారు. శనివారం సెక్టార్, రూట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామాగ్రి తీసుకువెళ్లడానికి అనుకూలంగా ఉండేలా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని అన్నారు. బస్సులు వెళ్లలేని పోలింగ్ కేంద్రాలకు బొలెరో, మ్యాక్సీ క్యాబ్ వాహనాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఓటింగ్ సమాచార నిమిత్తం సిగ్నల్స్‌లేని పోలింగ్ కేంద్రాలవద్ద ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని అన్నారు. పోలింగ్ సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకోవడంలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీతంపేట తహసీల్దార్ మహేశ్వరరావు, సెక్టార్, రూట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర పటిష్ట నిఘా ఉండాలి : కలెక్టర్ నిషాంత్‌కుమార్

విశాలాంధ్ర-కురుపాం : రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా ఆంధ్రా , ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ లు వద్ద నిరంతర పటిష్ట నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. శనివారం కురుపాం మండలం మంత్ర జోల సమీపంలోని మూలి గూడ జంక్షన్ లో ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎన్ని కేసులు నమోదయినవి, ఎంత మేరకు వాహనాలు సీజ్ చేసిన వివరాలను ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్ షణ్ముఖరావును అడిగి తెలుసుకున్నారు. తొమ్మిది కేసులు వరకు నమోదయ్యాయని 490 లీటర్ల నాటు సార పట్టుబడగా, రెండు చక్రాల వాహనం, ఫోర్ వీలర్ వాహనాన్ని సీజ్ చేసినట్లు కలెక్టర్ కు తెలిపారు. అక్రమ మద్యం, నగదు తరలించకుండా 24 గంటలు నిరంతర పటిష్ట నిఘాను పెట్టాలని సూచించారు. చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ద్వారా చెక్ పోస్ట్ తనిఖీలను కంట్రోల్ రూమ్ నుండి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. చెక్పోస్ట్ నుండి సీసీ కెమెరాలు పని తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ విధమైన ఉదాసీనతను ప్రదర్శించిన సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి ఏ.వెంకటరమణ, తహశీల్దార్ బి.శివశంకర్ సత్యనారాయణ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ కరుణాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటును వేయండి : ఎమ్మెల్యే జోగారావు విజ్ఞప్తి

విశాలాంధ్ర-పార్వతీపురం : రాష్ట్రంలో వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి గతఐదేళ్లుగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలనుచూసి వైఎస్సార్సీపీ అభ్యర్థులకు ఓటువేయాలని సిటింగ్ ఎమ్మెల్యే,పార్వతీపురం వైఎస్ఆర్సిపి అభ్యర్థి అలజంగి జోగారావు తెలిపారు. శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా యెనలేని అభివృద్ధి పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. అందరికీ 24గంటలపాటు అందుబాటు లో ఉండి ప్రజల కష్ట సుఖాల్లో పాల్గొనడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు రెండోసారి అవకాశాన్ని ఇవ్వాలని ఇంటింటికి వెళ్లి విజ్ఞప్తిచేస్తున్నారు. పలు గ్రామాల్లో ఆయనవెళ్ళి అవ్వాతాతలని, అక్కా చెల్లెళ్ళను, యువతీ యువకులను కలిసి ఓటును వేయాలని కోరుతున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా సీతానగరం మండలం లోని వైఎస్సార్సీపీ ప్రజా ప్రతినిదులు,నాయకులు పలుగ్రామాల్లోకి వెళ్లి జోగారావుకు ఓటువేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, ఎంపిపి ప్రతినిది బలగ శ్రీరాములు నాయుడు, జెడ్పీటిసి మామిడి బాబ్జిలు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రచారం చేస్తున్నామని తెలిపారు.

మన్యం జిల్లా నుండి ఫెన్సింగ్ పోటీలకు ఇద్దరు ఎంపిక

విశాలాంధ్ర పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా నుండి ఇద్దరు క్రీడాకారులు అనీల్ శర్మ అకాడమీ నుంచి ఈనెల 25 నుంచి 28తేదీలు మూడు రోజులపాటు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని జీఎస్-ఎల్ మెడికల్ కళాశాలలో జరుగనున్న జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని కోచ్ అనిల్ కుమార్ శర్మ తెలిపారు. ఈమేరకు ఎంపికైన కె.శ్రీహిత, కె.హాశితలకు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు, జిల్లా కార్యదర్శి డి.వి చారి అభినందనలు తెలియజేసారు.

డిగ్రీ స్థాయిలో మేజర్ సబ్జెక్టులు ప్రవేశపెట్టడం కొత్త పరిణామం

ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డా. పోల భాస్కరరావు

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : నూతన విద్యా విధానం 2020 ప్రకారంగా ఆంధ్రప్రదేశ్లో ఉన్నత విద్యలో అనగా డిగ్రీ స్థాయిలో మేజర్ సబ్జెక్టుల ప్రవేశపెట్టడం కొత్త పరిణామని, విషయాన్ని బోధించడానికి కావలసిన అధ్యాపకులను ట్రైనింగ్ ఇప్పించి ఆయా సబ్జెక్టులు సంబంధించిన సబ్జెక్టులు బోధించడానికి అధ్యాపకులు నియమించి విద్యార్థి బోధనలకు ఉపయోగపడతామని, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోల భాస్కరరావు మాట్లాడారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా తేది 23/03/2024 శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గుమ్మలక్ష్మిపురంనకు విచ్చేసి తనిఖీ చేశారు. కళాశాల అడ్మిషన్ విషయంలో సంతృప్తి చెందారు. తరగతి గదులు సరిపడా లేనందున అదనముగా మూడు తరగతి నిర్మించడానికి ఎస్టిమేషన్ వేసి ఇవ్వాల్సిందిగా ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. కమిషనర్‌తో ఆర్జేడి రాజమహేంద్రవరం డాక్టర్ శోభారాణి పర్యటించారు. కమీషనర్ విషయాలను అర్జడి కళాశాలలో ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలో ప్రిన్సిపాల్‌కు సిబ్బందికి సలహాలు సూచనలు చేశారు.

రైతులధాన్యం దబ్బులు చెల్లించండి మహాప్రభో

విశాలాంధ్ర-సీతానగరం : ధాన్యం తరలించి రెండు నెలలు గడుస్తున్న దబ్బులు అందక, సమాధానం చెప్పే నాథుడే లేక రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని చాలా గ్రామాల్లోని రైతులు సంక్రాంతి పండుగ తరువాత తరలించిన ధాన్యానికి డబ్బులు అందలేదని వాపోతున్నారు. ఇదిగో అదిగో అంటూ అధికారులు చెబుతున్నారని తప్ప చెల్లింపులు చేయడం లేదని పలువురు రైతులు తెలిపారు. తమకుతెలియదని గ్రామవ్యవసాయసహాయకులు, వ్యవసాయ అధికారులు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో తమకు డబ్బులు వస్తాయా... రావా అన్న ఆందోళనలో రైతులు ఉండటం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా అధికారులు అన్ని మండలాల పరిధిలోని రైతులకు ఇవాల్సిన బకాయలు గూర్చి ఆరాతీసి చెల్లింపులు చేయాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టరు గ్రీవెన్స్‌లో పిర్యాదుకోసం వెళ్ళాలని భావించిన తాము ఎన్నికల ప్రవర్తనా నియమావళి వల్ల గ్రీవెన్స్ ఆపివేశారని తెలిసి ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని చినభోగిలి రైతులు వాపోతున్నారు.

ప్రతీ నీటిబొట్టు ఎంతో విలువైనది : ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రమేష్

విశాలాంధ్ర-బెలగాం : ప్రతి నీటిబొట్టు ఎంతో విలువైనదని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ. రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నీటి ప్రముఖ్యతను గూర్చి తెలిపారు. సృష్టిలో ప్రతీ జీవికి నీటి అవసరం ఎంతో ఉందని, నీటిని వృధా చేయకుండా అవసరం మేరకు ఉపయోగించుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన నీటిని మరగబెట్టి చల్లార్చిన నీటిని మాత్రమే త్రాగాలన్నారు. వర్షాకాలంలో నీటిని పొదుపు చేసుకొనుటకు ఇంటి ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సామాజిక ఆర్థిక వృద్ధి ఎక్కువగా నీటిపైనే ఆధారపడి ఉంటుందని, త్రాగునీరు మానవ ఆరోగ్యానికి, శ్రేయస్సుకు చాలా అవసరమన్నారు. పోషకాహారం, గాలి, మానవ జాతికి ప్రాథమిక జీవనోపాధిని అందిస్తుందని ఇవి లేకుండా మనిషి జీవించడం అసాధ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జడ్జి ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి. సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నల్ల శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాది టి. జోగారావు, లోక్అదాలత్ మెంబరు జి. వెంకటరావు, అడిషనల్ పి.పి ఎం. వెంకటరమణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఓలకు ఒకరోజు శిక్షణ

విశాలాంధ్ర-సీతానగరం : స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మండలంలోని ఏపిఓలుగా నియమించబడిన వారికి శనివారం ఎలక్ట్రానిక్ ఓటింగ్/వి.వి.ప్యాట్ వినియోగంపై అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు,మండల విద్యా శాఖఅధికారులు సూరిదేముడు, సామల సింహాచలం, వెంకటరమణ, ఈఓపిఆర్డీ కుమార్ వర్మ, డిప్యూటీ తహశీల్దార్ పప్పల చిట్టెమ్మ, మాస్టర్ ట్రైనీలు పెంట రామక్రిష్ణ, సంతోష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

పన్నుపై వడ్డీ రాయితీ

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారి జిఓఎంఎస్ఎస్.నెం.35 ఎంఎ యుడి డిపార్ట్మెంట్ ఆదేశాల మేరకు ఆస్తి పన్నులు, ఖాళీ స్థలము పన్ను బకాయిలు ఏకమొత్తంలో మార్చి 31, 2024వ తేదీలోగా చెల్లించిన వారికి వడ్డీని మాఫీ చేస్తూ వడ్డీ రాయితీని ఇవ్వడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ తెలిపారు. కావున సదరు అవకాశమును పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఇంటి పన్నుల బకాయిలను, ఖాళీస్థలం పన్నుల బకాయిల చెల్లింపునకు 31.03.2024దీ వరకు మాత్రమే అవకాశం కలదని, పన్ను చెల్లింపు దారులు వార్డు సచివాలయాల్లోను మున్సిపల్ కార్యాలయాల్లో కూడా చెల్లించి తగిన రశీదును పొందాలన్నారు.ఆన్లైన్ ద్వారా చెల్లించదలచిన వారు సిడిఎంఎ.ఏపీ.జిఓవి.ఇన్ వెబ్సైట్లో ఆన్లైన్ పేమెంట్ ఆప్షన్ ద్వారా చెల్లించాలని కోరారు.

చెప్పింది చేశాం.... మరోసారి ఆశీర్వదించండి

ఎన్నికల ప్రచార ప్రారంభంలో వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర

విశాలాంధ్ర-సాలూరు రూరల్ : గత మ్యానిఫేస్టోలో పొందుపరిచిన హామీలను వైసీపీ ప్రభుత్వం దాదాపుగా అమలుచేయడం జరిగింది కాబట్టే స్వేచ్ఛగా ఓటు అడుగుతున్నామని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు.ఆనవాయితీ ప్రకారం నియోజకవర్గానికి ఈశాన్య దిశలో ఉన్న శివరాంపురం గ్రామంలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు.అనంతరం ముహూర్తం ప్రకారం శివాలయం వీధిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముహూర్తానికి కొన్ని ఇండ్లకు వెళ్లి వైకాపా ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను వివరించే కరపత్రాలను పంచి పెట్టారు.అనంతరం గ్రామంలో ప్రధాన వీధిగుండా నడుచుకుంటూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలంటూ ఓటర్లను అభ్యర్థించారు.ముఖ్య నాయకులతో కలసి రామాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాంపురానికి చాలా చేశాను ఒక్క ఓటు అయినా మెజారిటీ ఇవ్వండిలి శివరాంపురం గ్రామానికి అభివృద్ధి తో సంక్షేమ పథకాలను అందించానని వచ్చే ఎన్నికలలో గ్రామం నుండి ఒక్క ఓటు అయినా మెజారిటీ ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు.గత ఎన్నికలలో ఒక్క ఓటు మెజారిటీ ఇచ్చినా వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పానన్నారు.గ్రామంలో మెజారిటీ రాకపోయినా 5.95 కోట్లు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేశానన్నారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తానే వంతెన నిర్మాణం నకు నిధులు మంజూరు చేయగా పనులు ప్రారంభించామన్నారు.నిర్మాణం జరుగుచుండగా కాంట్రాక్టర్ మరణించడంతో పనులు ఆగాయన్నారు. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో తెదేపా అధికారం లోకి వచ్చాక వంతెన నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించందని తెలిపారు. వైకాపా అధికారం లోకి వచ్చాక 5.95 కోట్ల నిధులు ఇటీవల మంజూరు చేయించానని తెలిపారు.అంతేకాకుండా గ్రామంలో 21.14 కోట్లతో సంక్షేమ పథకాలు,గ్రామంలో ప్రతీ వీధికి సిసి రోడ్ల నిర్మాణం,సాలూరు నుండి గుమడాం మీదుగా శివరాంపురం గ్రామానికి బిటి రోడ్డు నిర్మించానన్నారు.ఒకప్పుడు గ్రామంలో 30 మందికి ఫించన్లు లభించేవని ప్రస్తుతం గ్రామంలో 588 మందికి ఫించన్లు అందజేస్తున్నామన్నారు.గ్రామంలో ఉన్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల తరలించడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తే తానే అడ్డుకున్నానని తెలిపారు. గ్రామంలో ఉన్న ప్రతీ ఒక్కరూ తన పనితీరును గుర్తించి ఆలోచించి ఓటు వెయ్యాలన్నారు.

లిఓటు అడిగే హక్కు వైకాపాకు మాత్రమే ఉంది.. సాలూరు నియోజకవర్గంలో ఓటు అడిగే హక్కు వైకాపా అభ్యర్థికి మాత్రమే ఉందన్నారు.ఈ ఐదేండ్లలో సాలూరు నియోజకవర్గం లో 1600కోట్ల కు పైగా సంక్షేమ పథకాలు,1200 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు.ప్రతీ గడపకి మేలు జరిగితేనే ఓటు వెయ్యండని ప్రచారం చేయగల దమ్మున్న పార్టీ వైకాపా అని అన్నారు.కులమతాలకు,రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామన్నారు.ప్రతీ గడపకు లబ్ధి చేకూర్చిన తమకు మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందన్నారు.అనైతిక పొత్తు పెట్టుకున్న పార్టీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

లిజె.పి.కమ్మని మాటలు... మేధావిగా గుర్తింపు పొందిన జయప్రకాష్ నారాయణ కులపరంగానే మాట్లాడుతున్నారన్నారు. ఇంతవరకు మేధావి అని గౌరవం ఇచ్చేవారమని కానీ నేడు కులం ముసుగులో తెదేపాకు అనుకూలంగా వైకాపాకు వ్యతిరేకంగా మాట్లాడటం సరికాదన్నారు. ఐదు సంవత్సరాల కాలంలో 2 లక్షల 56 వేల కోట్ల రూపాయలు సంక్షేమ పథకాల కోసం వైకాపా ప్రభుత్వం ఖర్చుచేస్తే వెనిజులా దేశం లో వలె ఆర్థిక సంక్షోభం వస్తుందని అంటున్న మేధావులు చంద్రబాబు ఇచ్చిన అబద్ధపు హామీల అమలుకు ఏడాదికే 1 లక్ష 20 వేల కోట్లు అవసరం అవుతుందన్నారు.ఆ లెక్కన ఐదేళ్లకు 6 లక్షల కోట్లు అవసరం అవుతాయని,అమలు కానీ హామీలిచ్చిన పార్టీలను సమర్థించేలా మేధావి అయిన జయప్రకాశ్ నారాయణ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇటువంటి వాఖ్యలతో ఆయన మేధావి తనంపై అనుమానం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు స్థానిక సర్పంచ్ జరజాపు మోహనరావు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు సువ్వాడ భరత్ శ్రీనివాస్, వైకాపా సీనియర్ నాయకులు మావుడి రంగునాయుడు, దండి శ్రీనివాసరావు, జరజాపు ఈశ్వరరావు, జరజాపు సూరిబాబు, సాలూరు మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జరజాపుదీప్తి తదితరులు పాల్గొన్నారు.

జిసిసి ద్వారా కొనుగోలు చేస్తున్న అటవీ ఉత్పత్తుల ధరలు పెంపు

డివిజనల్ మేనేజర్ మహేంద్రకుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం : గిరిజన సహకార సంస్థ (జిసిసి) పరిధిలో కొనుగోలు చేస్తున్న అటవీ ఉత్పత్తుల ధరలను జిసిసి గతవారం పెంచిందనీ గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ మహేంద్ర కుమార్ తెలిపారు.గిరిజన ప్రజల అభివృద్ధికోసం జిసిసి ఎండి తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాక్-బీతేనె 200 రూపాయలు నుండి 250/- రూపాయిలకు, ముషిడిక పిక్కలు కేజీ.70/- రూలు నుండి 90/- రూపాయలకు పెంచిందన్నారు. దీనిని గిరిజన రైతులు ఉపయోగించుకోవాలని, ఆయన కోరారు. అదే విధంగా కుంకుడు కాయలు బాగా ముదిరినవాటికి 35/- రూ. ధర ఇచ్చారని తెలిపారు. చింతపండు దిగుబడి ఈఏడాది అంత ఆశాజనకంగాలేదని, దీనివలన గిరిజన రైతులకు ఆర్థికంగా కొంత ఇబ్బంది కలిగిందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత సీజనులో దొరికే కుంకుడుకాయలు, కొండచీపుర్లు, ముషిడిక పిక్కలు సేకరించి గిరిజనులు దీని ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. గతఏడాది ఇచ్చిన ఖరీఫ్ లో గిరిజన రైతులకు ఇచ్చిన రుణాలు ఈనెలాఖరులోగా చెల్లించిన యెడల వారికి కొత్తగా రుణాలకు ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఈఏడాది అటవీ వ్యవసాయ ఉత్పత్తులు రూ.9.20కోట్లు లక్ష్యం పెట్టగా ఇప్పటివరకు రూ.12 కోట్ల వరకు కొనుగోలు చేశామని తెలిపారు. ప్రతీఏటా గిరిజనులకు మద్దతు ధర ప్రకారం చెల్లింపులుజరుపుతామని, ఈఏడాదికూడా చెల్లింపులు అదే విధముగా చెల్లిస్తున్నామని తెలిపారు. ఈఏడాది డివిజన్ పరిధిలో అన్ని విభాగాలు కలిసి సుమారు రూ. 56కోట్ల లక్ష్యంకుగాను రూ.60కోట్లు లక్ష్యం సాధించామని తెలిపారు. ప్రస్తుతము అటవీవిస్తీర్ణం తగ్గిపోవటం వల్ల ప్రస్తుతం పంటలు దిగుబడి కూడా తగ్గిందన్నారు. కావున గిరిజన రెతులకు జిసిసి, విఓవికె ల సమన్వయంతో గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. దీనివలన ప్రత్యామ్నా యాలు అయిన చిరుధాన్యాలు, పసుపు, కందులు, రాగులు వంటి వాటిపై శ్రద్ధ పెడుతున్నారని తెలిపారు. గిరిజనుల జీవనోపాదిని పెంపొందించేందుకు గిరిజన సహకార సంస్థ అన్నిరకాల చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇదిలాఉండగా జిల్లా ఎన్నికల అధికారి అదేశాలు సూచనలు మేరకు గిరిజన సహకార సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు, సిబ్బందికి, గిరిజనులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహణ కల్పిస్తున్నట్లు తెలిపారు.

నేడు ప్రపంచ క్షయ దినోత్సవం

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం : ప్రపంచ క్షయ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బగాది జగన్నాథ రావు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. దేశంలో ప్రతి ఏడాది లక్ష మంది ప్రజలకు సమారు 200 నుండి 215 మంది క్షయవ్యాధికి గురి అవుతున్నారని చెప్పారు. ఏడాదికి 3 నుండి 3.5 లక్షల వరకు మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. మరణాలు నియంత్రించుటకు ప్రభుత్వం వివిధ రకాలుగా అరోగ్య కారక్రములు చేపట్టిందని వెల్లడించారు. పార్వతీపురం జిల్లాలో 43 డిజిగ్నేటేడ్ మైక్రోస్కోప్ సెంటర్లు, 7 టిబి యూనిట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కేంద్రాల్లో 2023 జనవరి నుండి డిసెంబరు వరకు 1818 మందికి పాజిటివ్ గా గుర్తించడం జరిగిందన్నారు. అందులో 911 మందికి చికిత్స పూర్తి చేయడం జరిగిందన్నారు. జనవరి 2024 నుండి ఇప్పటి వరకు 230 మందిని గుర్తించి వారికి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. 98.3% మందికి క్షయ వ్యాధి నుండి విముక్తి కలిగించడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాలో 16 పంచాయితీలను క్షయ రహిత పంచాయతీలుగా ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు. క్షయ వ్యాధి మందులు తీసుకుంటున్న వారికి నెలకు రూ .500/- చొప్పున ఆరు నెలలకు మొత్తం మూడు వేలు వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. క్షయ బాధితులను దత్తత తీసుకున్న వ్యక్తులు అందిస్తున్న రూ.700/- తో పౌష్ఠిక ఆహారం కిట్లు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. పౌష్ఠికాహారం అందించుటకు ముందుకు వచ్చే దాతలు జిల్లా క్షయ నివారణ అధికారి వద్ద వివరాలు నమోదు చేయాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో ఏడు వందల మంది పౌష్ఠిక ఆహారం కిట్లు పొందుతున్నారని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వచ్చే వారిలో కనీసం 10 నుండి 15 శాతం వరకు కఫ పరీక్షలు చేయాలని ఆదేశించామని చెప్పారు. ఏఎన్ఎం, అశా కార్యకర్తలు క్షయరోగులను పరామర్శించి, మందులు వేసుకుంటున్నారో లేదో గమనించడమే కాకుండా ప్రతి రెండు నెలలకు ఒకసారి "కఫ" పరీక్షకు పంపించాలని సూచించామని చెప్పారు. మందులు వాడు రోగులకు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స పొందాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా క్షయ నివారణ అధికారి డా. నారాయణ రావు, ప్రోగ్రాం అధికారి డా. మంతిని వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ అమ్మవారి జాతర తేదీల ఖరారుకు సమావేశవుదాం

ముత్యాలమ్మ ఆలయ ధర్మకర్త అప్పారావు

విశాలాంధ్ర-చింతపల్లి : గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తేదీల ఖరారుకై ఈనెల 25న సాయంత్రం మూడు గంటలకు గ్రామపుర ప్రజలతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సుర్ల అప్పారావు అన్నారు. ఆలయ గర్భగుడి ప్రధమ వార్షికోత్సవ కార్యక్రమానికి చింతపల్లి విచ్చేసిన ఆయన గ్రామ పెద్దలు, భక్తులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్య ప్రాంతానికే మకుటాయమానంగా గిరిజన ప్రాంతంలో పాడేరు తరువాత అంతటి ప్రాశస్త్యం ఉన్న స్థానిక ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహించుటకు తేదీలు ఖరారు చేసి జాతరను అత్యంత వైభవంగా జరిపించుటకు గాను చింతపల్లిలో యావన్మంది పుర ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఉద్యోగ, వర్తక, మోటారు ఇతర అన్ని సంఘాలకు సంబంధించిన ప్రముఖులతో పాటు యువత సోమవారం సాయంత్రం మూడు గంటలకు ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో హాజరై చర్చలో పాల్గొని జాతర తేదీల ఖరారుకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

శ్రీవరసిద్ధి వినాయక ఆలయ ప్రతిష్ట

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేటలోని శ్రీశ్రీశ్రీ స్వామిదయానంద సేవా ఆశ్రమంలో నిర్మించిన శ్రీవరసిద్ధి వినాయక ఆలయ ప్రతిష్ట శనివారం జరిగింది. గుడినిర్మాణ నిమిత్తము దాతలవిరాళాలు అందించారుని,విగ్రహ విరాళాధాత ప్రముఖ శిల్పకళాచార్యులు ఈదిబిల్లి జగన్నాథ స్వామి అందజేసినట్లు తెలిపారు. దాతల సహకారం మరువలేనిదని కొనియాడారు.స్వామి దయానంద సేవ ఆశ్రమం ఇంచార్జి నల్ల సురేష్ అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

రామమందిర పున: ప్రతిష్ట సందర్భంగా ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-గరుగుబిల్లి : మండల పరిధిలోని రావుపల్లి గ్రామంలోని పెద్ద వీధిలో శ్రీసీతారామ మందిర పున:ప్రతిష్ట మహోత్సవములు రెండవ రోజు అయిన శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా ఉదయం ప్రాత: కాల మండప అర్చన ఔపాసనాలు, కుంకు మార్చనలు, గోపూజ, మహాసౌర పూర్వక సూర్యనమస్కారములు, క్షీరాదివాసములు, తదితర పూజా కార్యక్ర మాలు నిర్వహించడం జరిగిందన్నారు. శ్రీసీతారా మమం దిర పునః ప్రతిష్ట మహోత్సవంలు సందర్భ ముగా గ్రామ పురోహితులు బంకుపల్లి కృష్ణ మూర్తిశర్మ, బంకు పల్లి సూర్యనారాయణ శర్మ (సూర్యం పంతులు) సంపూర్ణ పర్యవేక్షణలో అదేవిధంగా తెలుగు పండితులు, పురాణవాచ స్పతి, పు%శీ%భావ సరస్వతి బంకుపల్లి లక్ష్మీనారా యణశర్మ, మహమిడి ప్రసాద్ శర్మ, బంకుపల్లి లలితా సింహాచల గురునాథశర్మ(కిరణ్), అంపోలు సంతోష్ కుమార్శర్మ తదితరుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. శ్రీరామ మందిర ప్రతిష్టా మహోత్సవములు సందర్భముగా పలు సాంస్కృతిక కార్య క్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ గుల్ల సూర్య ప్రకాశరావు, మాజీ సర్పంచ్ గుల్ల కాశినాయుడు, గుల్ల అన్నపూర్ణమ్మ , గుంట్రెడ్డి హరికుమార్, గుల్ల శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ అమ్మవారి వార్షికోత్సవం

వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అన్న సమరాధన

విశాలాంధ్ర-చింతపల్లి : చింతపల్లి గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి గర్భగుడి నిర్మించి ఏడాది పూర్తి చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ప్రధమ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన అన్న సమారాధన కార్యక్రమం శనివారం ఘనంగా ముగిసింది. వార్షికోత్సవ కార్యక్రమం ను పురస్కరించుకొని ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమానికి వందలాదిగా తరలివచ్చిన భక్తులు ముందుగా అమ్మవారికి పసుపు, కుంకుమలు నైవేద్యంగా సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సుమారు 2000 మంది వరకు అన్న ప్రసాదాన్ని స్వీకరించడంతో ఆలయ కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది.

డాక్టర్ సూర్యప్రకాష్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర-గరుగుబిల్లి : ఈప్రాంత ప్రజలకు మంచి వైద్యం అందించాలన్న లక్ష్యంతో తన స్వగ్రామమైన రావుపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేసి నిష్ణాతులైన వైద్యులచే వైద్యం అందించిన ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ సూర్య ప్రకాష్‌ను సన్మానించడం తమకెంతో ఆనందంగా ఉందని ప్రముఖ వైద్యులు డా.ద్వారపురెడ్డి రామ్మోహనరావుతోపాటు రావుపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ గుల్ల కాశినాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు గుల్ల అన్నపూర్ణమ్మ, కాపారపు శివున్నాయుడులు అన్నారు. మండల పరిధిలోని రావుపల్లి గ్రామానికి చెందిన ప్రస్తుతం హైదరాబాద్ కేర్ హాస్పిటల్‌లో ప్రముఖ కార్డియాల జిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ గుల్ల సూర్య ప్రకాశరావును డాక్టర్ రామ్మోహనరావుతోపాటు మాజీ సర్పంచ్ గుల్ల కాశినాయుడు, మాజీ ఎంపిటిసి సభ్యురాలు అన్నపూర్ణమ్మ, కాపారపు శివున్నాయుడులు శాలువా కప్పి ఘనంగా సన్మానిం చారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇంతటి ఉచిత మెగా వైద్య శిబిరంను నిర్వహించడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. ఈవైద్య శిబిరంలో వైద్యంతోపాటు ఖరీదైన మందులను అందజేయడంపట్ల వైద్య సహాయం నిమిత్తం వచ్చే పలు గ్రామాల ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేశారని తెలిపారు. వైద్య సాయం నిమిత్తం వచ్చే పలు గ్రామాల ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా డాక్టర్ సూర్యప్రకాష్, డాక్టర్ రామ్‌నరేష్‌లు ఏర్పాట్లు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఏరియా హాస్పిటల్ సివిల్ సర్జన్ డాక్టర్ గుల్ల రామ్ నరేష్, గుంట్రెడ్డి హరికుమార్, గుల్ల శంకరరావు, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయ వ్యాధి అంతం

క్షయ వ్యాధి ఎన్ఓటిసి లక్ష్మీకాంత్

విశాలాంధ్ర-చింతపల్లి : క్షయ వ్యాధిని అవగాహనతోనే అంతమొందించగలమని ఆ వ్యాధి ఎం ఓ టి సి, లోతుగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లక్ష్మీకాంత్ అన్నారు. జాతీయ క్షయ వ్యాధి దినోత్సవ కార్యక్రమాన్ని స్థానిక సామాజిక ప్రాంతీయ ఆసుపత్రిలో క్షయ వ్యాధి సూపర్వైజర్ ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన తోటి వైద్యులు, వైద్య సిబ్బందితో కలిసి క్షయ వ్యాధి నిర్మూలనను పురస్కరించుకొని ముందుగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎడతెరిపిలేని దగ్గు, విడవకుండా వచ్చే జ్వరం, ఆకలి మందగించడం, విపరీతమైన కళ్ళే రావడం, రోజురోజుకు శక్తి క్షీణించడం క్షయ వ్యాధి లక్షణాలన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రం తో పాటు, పరిసరాల పరిశుభ్రతను పాటించి క్షయ వ్యాధితో పాటు ఇతర రుగ్మతల నుంచి దూరంగా ఉండాలని, క్షయ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ఆసుపత్రులలో మెరుగైన వైద్యం పొందాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి సూపరిండెంట్ చంద్రశేఖర్, ఆర్ వి నగర్ వైద్యాధికారులు సౌమ్య, రాజా రవీంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-బెలగాం : సిబ్బంది సమన్వయంతో కృషి చేసి జిల్లాలో జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథ రావు అన్నారు. ఈ మేరకు స్థానిక ఎన్జీఓ భవనంలో ఆరోగ్య పర్యవేక్ష కులు, సహాయకులకు కీటకజనిత వ్యాదుల నియంత్రణ పై నిర్వహించిన రీ ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ శిక్షణలో పొందిన పరిజ్ఞానంతో క్షేత్ర స్థాయిలో కార్యాచరణ చేసి, దోమల వ్యాప్తి నియంత్రణ చర్యలు చేపడుతూ జ్వరాలు ప్రబలకుండా దృష్టి సారించాలన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు సర్వేలియన్స్ చేపట్టాలని, మలేరియా, డెంగీ లక్షణాలతో ఉన్న వారిని గుర్తిస్తే వెంటనే నిర్ధారణ పరీక్షలు జరిపాలన్నారు. హాస్టల్ విద్యార్థుల్లో జ్వరాలు గుర్తిస్తే వెంటనే చికిత్స అందజేసి పర్యవేక్షణ చేయాలన్నారు. డ్రైడే కార్యక్రమాలు పక్కగా నిర్వహించి డ్రైడే పాటించేలా ప్రజల్లో అవగాహన పెంపొందించాలని చెప్పారు. జిల్లాలో మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో మరింతగా దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు మాట్లాడుతూ రెండు రోజుల శిక్షణలో దోమల నియంత్రణ చర్యల పద్ధతులు, స్ప్రేయింగ్ పద్ధతులు, కీటక సంహారిణి రసాయనాలు వాటిని వినియోగించు విధానం, జ్వరాల లక్షణాల ద్వారా గుర్తించడం, చికిత్స, క్షేత్ర స్థాయిలో విధి నిర్వహణకు మొదలగు అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించి సిబ్బందికి పరిజ్ఞానాన్ని పెంపొందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్, ఎఎంఓ సూర్యనారాయణ, జిల్లా విబిడి కన్సల్టెంట్ రామచంద్రరావు, ఈఓ నాగేంద్ర, సబ్ యూనిట్ అధికారులు, మలేరియా టెక్నికల్ సూపర్ వైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి తు.చ. తప్పకుండా పాటించాలి

ఎంపీడీవో సూర్యనారాయణ

విశాలాంధ్ర-గరుగుబిల్లి : గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిని తుచ తప్పకుండా అమలుచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పైల సూర్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని వల్లరిగుడబ గ్రామంలో ఎఫ్ఎస్‌టి టీంతో కలిసి ఎన్నికల ప్రవర్తన నియమావళిని పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామస్థాయి అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉండొద్దని పేర్కొన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తగుచర్యలు చేపట్టడం జరుగు తుందన్నారు. ఎక్కడా ఎన్నికల ప్రవర్తనా నియమా వళి అమల్లో నిర్లక్ష్యం ఉండ రాదని ఎంపీడీవో సూర్యనారాయణ స్పష్టం చేశారు. ఎన్ని కల కమీషన్ నియమాలు తుచ తప్పక పాటిం చాలని పేర్కొన్నారు. ఈపరిశీలన లో ఎఫ్ ఎస్ టి అధికారులు బర్లి గౌరీ శంక ర్రావు, గ్రామపంచాయతీ కార్యదర్శి డొక్కర దిలీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాతర నిర్వహణ తేదీల ఖరారుకై సహకరించండి

సర్పంచ్ పుష్పలత

విశాలాంధ్ర-చింతపల్లి : చింతపల్లి గ్రామ దేవత ముత్యాలమ్మ జాతర నిర్వహణకై తేదీలను నిర్ణయించేందుకు ఈనెల 25న అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ప్రతి ఏటా గంధమావాస్య ను పురస్కరించుకొని నిర్వహించే గ్రామదేవత శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు గాను గ్రామంలోని యావన్మంది పుర ప్రజలు, ఉద్యోగ, వర్తక, మోటారు, ఇతర అన్ని సంఘాల వారితోపాటు యువత సోమవారం సాయంత్రం ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించు సమావేశానికి హాజరుకావాలని ఆమె పిలుపునిచ్చారు.

నాన్చుడు ధోరణి నష్టమే

విశాలాంధ్ర-చింతపల్లి : తప్పనిసరిగా విజయం వరిస్తుందనే స్థానాలలో అభ్యర్థులను ప్రకటించడంలో అధినాయకత్వాల నాన్చుడు ధోరణి నష్టం కలిగించనుందని పాడేరు నియోజకవర్గ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గడచిన ఐదేళ్ల కాలంలో ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గతం కంటే బలాన్ని పెంచుకోవడంతో పాటు వైసీపీకి దీటుగా పోటీని ఇచ్చేందుకు సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో కూటమిగా ఏర్పడిన తెలుగుదేశం, జనసేన, బిజెపిల ఉమ్మడి అభ్యర్థిగా నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో కేడర్ లేని బిజెపికి పాడేరు సీటు కేటాయించడంతో తెదేపా శ్రేణులలో అంతర్మదనం ప్రారంభమైంది. విజయపుటంచుల వరకు పార్టీని తీసుకువెళ్లిన తెదేపాశ్రేణులలో అభద్రతాభావం నెలకొంది. తెదేపా గెలిచే స్థానాన్ని బిజెపికి కేటాయించడం వలన వైసీపీకి విజయావకాశాలు సులభతరం అవుతాయని ఈ ప్రాంతీయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి తరుణంలో ఇటు తెలుగుదేశం కానీ, అటు బిజెపి గాని ఇప్పటివరకు పాడేరు నియోజకవర్గంలో అభ్యర్థిని ప్రకటించకుండా నాన్చుడు ధోరణి ప్రదర్శించడం అన్ని విధాలా నష్టమే అని తెదేపా శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నాటు తుపాకీలు కలిగి ఉంటే క్రిమినల్ చర్యలు తప్పవు : సిఐ

విశాలాంధ్ర-మారేడుమిల్లి : అల్లూరు సీతా రామరాజు జిల్లా, ఎస్పి తుహీన్ సిన్హా ఆదేశాలు మేరకు, రంపచోడవరం ఏ ఎస్ పి, జగదీశ్ అడహల్లి పర్యవేక్షణలో రాబోవు సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా శనివారం మారేడు మిల్లి మండలం లో జంతువు లును వేటాడే నాటు తుపాకీలు దొర చింతలపాలెం, నరసాపురం గ్రామాల్లో నాలుగు సింగిల్ బ్యారల్ తుపాకీలు సిఐ ఆర్.భీమరాజు నేతృత్వంలో స్వాధీనం పరుకున్నారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా నాటు తుపాకీలు కలిగి ఉంటే స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్‌కి అప్పగించాలని, లేనిపక్షంలో తనిఖీలు నిర్వహించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ప్రకటనలో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మారేడుమిల్లి ఎస్ఐ రాము, గుర్తేడు ఎస్ఐ సాయికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ వర్క్‌షాప్‌కు మన్యంజిల్లా టీడీపి అభ్యర్థులు, పరిశీలకులు

విశాలాంధ్ర-పార్వతీపురం: రెండురోజుల పాటు విజయవాడలో జరుగుతున్న టీడీపీ వర్క్ షాప్‌కు మన్యంజిల్లా నుండి పార్వతీపురం, కురుపాం, సాలూరు టీడీపీ అభ్యర్థులు బోనెల విజయ్ చంద్ర, తోయక జగదీశ్వరి, గుమ్మడి సంధ్యారాణితోపాటు పాలకొండ నియోజక వర్గ ఇంచార్జి నిమ్మక జయకృష్ణలు, పార్టీపరిశీలకులు హాజరయ్యారు. శని, ఆదివారాల్లో విజయవాడ లోని ఏ1 కన్వెన్షన్ సెంటర్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అభ్యర్థులకు దిశ-దశ చేస్తున్నట్లు తెలిపారు. 50రోజులపాటు నిర్వహించాల్సిన ఎన్నికల ప్రణాళిక, ఎన్నికల కమిషన్ జారీచేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహణ, పోల్ మేనేజ్మెంట్, ఎన్నికల ఖర్చు,అభ్యర్థులకు పలు అంశాలపై అవగాహన, ప్రచారంగూర్చి, నామినేషన్ల గూర్చి, ఉమ్మడిపార్టీల నేతలతో సమన్వయం తదితర అంశాలపై టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వివరించారు. మూడుపార్టీల నాయకులు కలిసి మెలిసి ఉంటూ పార్టీ గెలుపుకు పనిచేసే విధానాన్ని వివరించారు.మొదటి రోజు శనివారం జరిగిన వర్క్ షాప్ ద్వారా అన్ని అంశాలపై టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, టీడీపి నేతలు పూర్తిఅవగాహన కల్పించారని పార్వతీపురం టీడీపీ అభ్యర్థి విజయ్ చంద్ర చెప్పారు.

గుచ్చిమి, సూరమ్మపేటలలో టీడీపి ప్రచార కార్యక్రమాలు

విశాలాంధ్ర-సీతానగరం: టీడీపి అదినేత చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసేందుకు, టీడీపి అభ్యర్థి విజయ్ చంద్రను ఎమ్మెల్యే చేసేందుకు అంతా కలిసికట్టుగా ఉండి, కష్టపడి పనిచేయాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని గుచ్చిమి, సూరమ్మపేట గ్రామాల్లో విజయ్ చంద్ర సూచనల మేరకు బాబు భవిషత్ గ్యారంటీ, టీడీపి సిక్స్ కార్యక్రమాల గూర్చి వివరించారు. ఎన్నికలు జరిగే వరకు అంతా కష్టపడి పనిచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాల నాయుడు, సాలహరి, దామినేని భానుప్రసాద్, రెడ్డి సింహాచలంనాయుడు, బొమ్మినాయిని లక్ష్మణరావు, తెంటు రామారావు, బలగ శ్రీనివాసరావు, సోమిరెడ్డి రమేష్, సూర్యనారాయణ, బూరాడ చిరంజీవి, సంజీవి నాయుడు, యోగేశ్వరరావు, ఫకీరునాయుడు, సత్యనారాయణ తదితరులతో పాటు జనసేన నాయకులు పాల్గొన్నారు.